సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 26 । నవంబర్ । 2024

దేదీప్యమానం.. దీపోత్సవం



టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ దర్శన్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం దేదీప్యమానంగా జరిగింది.

8లో

కార్తీక శోభ





కార్తీక ఆఖరి సోమవారం సందర్భంగా జిల్లాలో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో బిల్వార్చన, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కార్తీక దీపాలు వెలగించారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నృత్య వైభవం

భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని విశాఖలో నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు సోమవారం కొనసాగాయి. ఆదివాసీ మహిళలు చేసిన నృత్యాలు అలరించాయి. 8లో



4 కి.మీ.. రూ.320 కోట్లు



ఫ్లైఓవర్ ఊహాచిత్రం

ఫ్లైఓవర్ నిర్మాణానికి విశాఖ పోర్టు అథారిటీ సన్నద్ధం

- విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణ చర్యలు
- పోర్టు వాహనాల రద్దీని తగ్గించేలా ప్రణాళికలు
- సీహార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకూ ఫ్లైఓవర్ నిర్మాణం
- రెండు మూడు నెలల్లో టెండర్లకు వెళ్లాలని నిర్ణయం

కార్గో రవాణా సమయం తగ్గించుకునేలా.. కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు ఉపశమనం కలిగించేలా విశాఖ పోర్టు అథారిటీ మరో ప్రాజెక్టుకి శ్రీకారం చుడుతోంది. పోర్టుకు వచ్చే వాహనాలు నేరుగా జెట్టీలోకి వెళ్లేలా భారీ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. నౌకాశ్రయానికి వచ్చే వాహనాలు ఇళ్ల మధ్య నుంచి వెళ్లకుండా ఉండేలా చేసే ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.320 కోట్లు కేటాయించాలని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఫ్లైఓవర్‌కి సంబంధించిన డీపీఆర్‌ని 2021లోనే పోర్టు సిద్ధం చేసింది. అయితే కొత్త ఆలోచనల నేపథ్యంలో సవరణల బాధ్యతలను ఆర్‌వీఎన్‌ఎల్‌కు అప్పగించింది. త్వరలోనే టెండర్లు పిలిచేందుకు వీపీఏ సన్నద్ధమవుతోంది. – సాక్షి, విశాఖపట్నం



కాలుష్య రహిత విశాఖ కోసం..

వివిధ ప్రాజెక్టుల పనులు విశాఖ పోర్టు అథారిటీ నిర్వహిస్తోంది. క్లీనెస్ట్ పోర్టుగా మరింత మెరుగుపరచుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. విశాఖ నగరాన్ని మరింత కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు పోర్టు చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా గ్రేడ్ సెపరేటర్స్ మాదిరి ఫ్లైఓవర్ నిర్మిస్తున్నాం. పోర్టుకు ఏడాదికి సుమారు 2500 వరకూ షిప్స్ వస్తుంటాయి. రోజూ వందలాది ట్రక్కులు సరకు రవాణా చర్యలు చేపడుతున్నాయి. ట్రాఫిక్, లెవల్ క్రాసింగ్స్ కారణంగా రవాణా ఆలస్యమవుతోంది. అందుకే ఫ్లైఓవర్ల నిర్మాణంపై దృష్టి సారించాం. సరుకు రవాణా, సామర్థ్య నిర్వహణ పరంగా మేజర్ పోర్టుల్లో నంబర్ వన్‌గా నిలవాలన్నదే మా లక్ష్యం. అందుకే సాగరమాల, గతిశక్తి ప్రాజెక్టులతో రూ.కోట్ల రూపాయల పనులు నిర్వహిస్తున్నాం.

– డా.అంగముత్తు, విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్

2021లో డీపీఆర్ సిద్ధం చేసినా..



ఫ్లైఓవర్ రానున్న సీహార్స్ జంక్షన్

పోర్టు అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక ఫ్లైఓవర్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పోర్టుకు వచ్చే సరకు రవాణా వాహనాల రాకపోకల కోసం దీన్ని వినియోగించాలని నిర్ణయించారు. రామకృష్ణ వీధి పోర్టు లైన్‌లో ఉన్న సీహార్స్ జంక్షన్ నుంచి పోర్టులోపల ఉన్న డాక్ ఏరియా వరకూ 4 కిలోమీటర్ల సుదీర్ఘ ఫ్లైఓవర్ నిర్మాణం చెయ్యాలని వీపీఏ నిర్ణయించింది. తొలుత విశాఖపట్నం పోర్టు రోడ్డు కంపెనీ లిమిటెడ్(వీపీఆర్‌సీఎల్)తో కలిసి దీన్ని నిర్మించాలని భావించారు. అయితే.. సొంత నిధులతోనే ఫ్లైఓవర్ నిర్మించాలని అప్పటి పోర్టు అధికారులు నిర్ణయించడంతో.. ప్రాజెక్టు ఆలస్యమైంది. 2021లో ఒక డీపీఆర్ సిద్ధం చేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) పరిధి ఏమైనా ఉందా లేదా అని పరిశీలనకు పంపించారు. తమ పరిధిలో లేదని ఎన్‌హెచ్‌ఏఐ చెప్పడంతో.. పీపీపీ విధానంలో నిర్మించేందుకు పోర్టు సిద్ధమైంది. కానీ.. అప్పటి అధికారులు సొంతంగా నిర్మించాలన్న ఉద్దేశాన్ని బోర్డు సమావేశంలో చెప్పడంతో.. ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

డీపీఆర్ సవరణ బాధ్యత ఆర్‌వీఎన్‌ఎల్‌కు..

విశాఖ పోర్టుకు ప్రతిరోజూ కార్గో రవాణా వాహనాలు వేల సంఖ్యలో వెళ్తుంటాయి. ఇందులో ముఖ్యంగా బొగ్గు, ఐరన్ ఓర్ మొదలైన సరుకు రవాణా వాహనాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి వెళ్తున్న సమయంలో చిన్న చిన్న ధూళికణాలు ఎగరడంతో పాటు.. వాహనాల పైనుంచి జారి పడుతుండటం వల్ల రహదారులు పాడవ్వడంతో పాటు నగరంలోని ఎక్కువ ప్రాంతం ఇళ్లల్లోకి ధూళికణాలు చేరుతూ కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. దీన్ని అధిగమించాలంటే.. ఈ తరహా వాహనాలు నేరుగా పోర్టులోపలికే వెళ్లిపోయేందుకు ఫ్లైఓవర్ ఉపయోగపడుతుంది. ఇప్పటికే జ్ఞానాపురం నుంచి సీహార్స్ జంక్షన్ వరకూ ఫ్లైఓవర్ ఇటీవలే అందుబాటులోకి తీసుకురావడంతో.. అక్కడి నుంచి మరో అనుసంధానిత ఫ్లైఓవర్ రానుంది. దీంతో.. పోర్టు వాహనాలు నగరంలోకి వచ్చేందుకు ఆస్కారం ఉండదు. దీంతోపాటు.. ప్రజారవాణా వాహనాలతో పోర్టు వెహికల్స్ రావడం వల్ల ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఫలితంగా.. రవాణాకు పట్టే సమయం పెరిగిపోతోంది. ఈ ఫ్లైఓవర్ నిర్మిస్తే సమయం కూడా కలిసివస్తుంది. కొత్తగా ఈ ప్రాంతంలో రోడ్లు నిర్మించడంతో పాత డీపీఆర్‌లో స్వల్ప మార్పులు చేపట్టాల్సి వచ్చింది. ఈ బాధ్యతల్ని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్)కు అప్పగించింది. ప్రస్తుతం ఈ పనిలో ఆర్‌వీఎన్‌ఎల్ నిమగ్నమై ఉంది. చిన్న చిన్న మార్పులే కావడంతో.. త్వరలోనే సమగ్ర డీపీఆర్ సిద్ధం కానుంది. డీపీఆర్ వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంకి పంపించి.. అక్కడి నుంచి అనుమతులు పొందిన అనంతరం.. పనులకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. రెండు మూడు నెలల్లోనే టెండర్లని ఆహ్వానించాలని పోర్టు అధికారులు భావిస్తున్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ సెంటర్‌కు అనుమతులు



అరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెకండరీ లెవెల్ కెమికల్ బైలాజికల్ రేడియాలజికల్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు కానుంది. కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసినట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఒప్పందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపారన్నారు. ఈ కేంద్ర ఏర్పాటు కోసం విమ్స్ ఆవరణలో 1.8 ఎకరాల స్థలం కేటాయించామన్నారు. ఈ స్థలంలో మూడు అంతస్తుల భవన నిర్మాణం చేపడతారన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు మెరుగైన వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. ఇంతవరకు అలాంటి బాధితులను కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే విమ్స్‌లోనే వాటికి సంబంధించిన సేవలు అందుతాయన్నారు.

30లోగా హౌస్ హోల్డ్ జాబితా సర్వే పూర్తి

మహారాణిపేట: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉండే ఇళ్లు/ఫ్లాట్లు/అపార్టుమెంటు/ గేటెడ్ కమ్యూనిటీ హౌస్ హోల్డ్ జాబితా రూపొందించేందుకు సచివాలయ ఉద్యోగులతో సర్వే చేస్తున్నామని, ఈ సర్వేకు ప్రజలందరు సహకారం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. ఈ సర్వేలో ఎటువంటి సందేహాలు, అపోహలకు తావు లేకుండా జియో టాగింగ్ యాప్‌లో ప్రతి ఇంటి నుంచి అన్ని వివరాలతో బయోమెట్రిక్‌తో వివరాలు నమోదు చేయనున్నామన్నారు. ఈనెల 30వ తేదీలోపు సర్వే పూర్తి చేయవలసి ఉందన్నారు.

బిందెలతో జెడ్సీ కార్యాలయం ముట్టడి



బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కంచరపాలెం: మహిళలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం పరిధిలోని ఏఎస్ఆర్ నగర్ జేఎన్ఎన్ఆర్‌యూఎం కాలనీకి చెందిన 280 కుటుంబాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో చిట్టిబాబు కాలనీకి చెందిన మహిళలు, ఎస్టీ, ఎస్సీ, బీసీల సంక్షేమ సేవా సంఘం నేతృత్వంలో జ్ఞానాపురం జోన్–5 కార్యాలయాన్ని బిందెలతో ముట్టడించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో నిరసన వ్యక్తం చేశామని సంఘం అధ్యక్షుడు గౌరీష్ తెలిపారు. ఇదిలావుండగా జోన్–5 కార్యాలయ అధికారులకు వినతి పత్రం ఇచ్చేందుకు ఐదో పట్టణ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో వారిని నెట్టుకుంటూ జెడ్సీ చాంబర్‌లోకి దూసుకుపోయారు. సమస్య పరిష్కరిస్తానని జోనల్ కమిషనర్ బి.రాము హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

ఏసీపీపై మహిళా సీఐ ఫిర్యాదు

విశాఖ సిటీ: ఏసీపీపై మహిళా సీఐ ఫిర్యాదు పోలీసు శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. సహచర సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ చేసిన ఫిర్యాదు చర్చనీయాంశమవుతోంది. వీరి వివాదం రాష్ట్ర పోలీస్ బాస్ దృష్టికి వెళ్లనుంది. మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ పెంటారావు వ్యవహార శైలి, మాటతీరు పట్ల ఆ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరి మనస్తాపం చెందారు. దీనిపై ఆమె నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల దృష్టికి తీసుకువెళ్లాలని సీపీ నిర్ణయానికి వచ్చారు.

మెగా.. దగా



- మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై నీలినీడలు
- నిరుద్యోగులకు తప్పని ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో 734 ఖాళీల గుర్తింపు
- రోస్టర్ పాయింట్లు వెరిఫికేషన్ పేరిట తాత్సారం
- డీఎస్సీ కోసం పోస్టుల బ్లాక్.. పదోన్నతులు కోల్పోతున్న టీచర్లు

శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన ఇందిర భర్తతో పాటు విశాఖలో ఉంటోంది. ప్రైవేటు స్కూల్లో చేస్తున్న ఉద్యోగం మానేసి, విశాఖ వచ్చి ఆరు నెలలుగా డీఎస్సీకి సిద్ధమవుతోంది. ఇద్దరు పిల్లల్లో ఒకర్ని భర్త చూసుకుంటుండగా, చిన్నోడిని తల్లి వద్ద ఉంచేసి, ఎలాగైనా కొలువు సాధించాలని పట్టుదలతో చదువుతోంది. కానీ డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యమవుతుండటంతో ఒత్తిడికి గురికావల్సి వస్తోందని ఇందిర తెలిపింది. ఒక్క ఇందిరే కాదు విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న ఏ ఒక్కరిని కదిపినా ఇదే మాట వినిపిస్తోంది.

విశాఖ విద్య : మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే అని గొప్పలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ మాత్రం ప్రకటించలేదు. ఈ నెల 6న నోటిఫికేషన్ జారీచేస్తారని అంతా అనుకున్నా మళ్లీ వాయిదా పడింది. ఇంతకీ ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందో..? లేదోనన్న సందేహాలు కలుగుతున్నాయి. టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డీఎస్సీ కోసం రేయింబవళ్లు సిద్ధమవుతున్నారు. కొంతమంది ప్రైవేటు స్కూళ్లలో చేస్తున్న కొలువు మానేసి.. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నారు. కూటమి ప్రభుత్వం అదిగో, ఇదిగో డీఎస్సీ అంటూ కాలయాపన చేస్తుండటంపై



విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీల గుర్తింపుపై కానరాని స్పష్టత

మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు 1,134 పోస్టులు భర్తీ చేయనున్నారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నారనే క్షేత్ర స్థాయి నివేదికలతో ప్రభుత్వం డైలమాలో పడింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో 734 ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు లెక్క తేల్చారు. వీటిలో ఎస్జీటీ పోస్టులు 216 వరకు ఉన్నాయి. దీనిపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవటం, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై రోజుకో ప్రకటన చేస్తుండటంపై నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

రోస్టర్ పాయింట్లతో రాద్ధాంతం

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసమని ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టుల రోస్టర్ పాయింట్ల లెక్క తేల్చాలని ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో రోస్టర్ పాయింట్ల వ్యవహారంతో ఇటీవల జరిగిన ప్రమోషన్ల ప్రక్రియలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై కాలయాపన చేస్తున్న నేపథ్యంలోనే తేనెతుట్టెను కదుపుతోందని ఉపాధ్యాయులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో విలీనమైన సమయంలోనే మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో క్యాడర్ స్ట్రెంగ్త్ వివరాలను స్థిరీకరించాల్సి ఉండగా, అప్పట్లో జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవటంతో ఇప్పుడు సమస్యలొచ్చిపడ్డాయి.

టీచర్లకు ప్రమోషన్ల కోత

మెగా డీఎస్సీ మాటేమోకానీ.. **ఆ బూచితో ప్రస్తుతం** పనిచేస్తున్న ఉపాధ్యాయుల **ప్రమోషన్లకు కూటమి** ప్రభుత్వం కోతపె**డుతోంది.** వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో **నెలవారీ ఉద్యోగోన్నతుల** ప్రక్రియ ఉండేది. **కూటమి ప్రభుత్వం** అధికారంలోకి **వచ్చాక** వాటి ఊసే లేదు. విశాఖ, అనకాపల్లి **జిల్లాల్లో** ఉన్న మున్సిపల్ మేనేజ్‌మెంట్ స్కూళ్ల**లో అన్ని** క్యాడర్లు కలిపి ఇటీవల 11 మందికి ప్ర**మోషన్లు** ఇచ్చారు. డీఎస్సీ కోసం 109 ఖాళీలు చూ**పించ**గా.. వీటిలో 30 శాతం కోటా మేరకు **ప్రమోషన్లు** కల్పించాలి. ఈ విషయంలో జరిగిన **తప్పి**దాలతో మరోమారు ఖాళీల గుర్తింపుపై **రాష్ట్ర** స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. **కూటమి** ప్రభుత్వం రోజుకో నిర్ణయం తీసుకుం**టుండ**టంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

ఆశతో ఎదురుచూస్తున్నాం..

డీఎస్సీ ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. పద్మనాభం నుంచి విశాఖ వచ్చి రూమ్ తీసుకొని రాత్రీపగలనకుండా ఎంతో కష్టపడి చదువుతున్నాం. కోచింగ్ కోసం చాలా డబ్బులు ఖర్చు చేశాం. ప్రతీ ఏడాది డీఎస్సీ ప్రకటించి, పోస్టులను భర్తీ చేయాలి. మెగా డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలి. – ప్రియాభవానీ, ఎమ్మెస్సీ, ఎంఈడీ, పద్మనాభం

దద్దరిల్లిన కలెక్టరేట్



వీవోఏలు, మధ్యాహ్న భోజన కార్మికులు, శానిటేషన్ వర్కర్ల సమస్యలపై నిరసన

ఉద్యోగులు, కార్మికుల నిరసనలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

- శానిటేషన్ వర్కర్స్, వీవోఏ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల నిరసన
- ఇసుక విధానాన్ని నిరసిస్తూ ఆందోళన


మహారాణిపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ఎలా బతికేది అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వీవోఏలకు కూడా ఐదు నెలలు జీతాలు చెల్లించకపోవడంతో ఆందోళన బాట పట్టారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు రెండు నెలలుగా జీతాలు, మూడు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. తక్షణం వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మణి మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా గొప్పలు చెప్పుకున్నారని, వాస్తవానికి వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతి నెలా కాదు కదా.. రెండు నెలలకొకసారి కూడా జీతాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లకు, వీవోఏలకు, మిడ్ డే మీల్ కార్మికులకు నెలల తరబడి ఎందుకు వేతనాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మిడ్ డే మీల్ మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ నాయకులు లక్ష్మి, సుజాత, మిడ్ డే మీల్ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, భవాని, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

దళారీలు దోచేస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇసుక విధానం ఎంతోమంది జీవితాల్ని రోడ్డున పడేసిందంటూ క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టింది. అనంతరం అసోసియేషన్ కార్యదర్శి కర్రి రమణ ఆధ్వర్యంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఇసుక రీచ్‌ల్లో దళారీలు దోచేస్తున్నారని, టన్నుకు అదనంగా రూ. 300 వరకూ వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

'సెవెన్ హిల్స్' కార్మికులను తొలగించొద్దు

ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యంతో కుమ్మక్కైన పలు శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యం 38 మంది హౌస్ కీపింగ్ కార్మికులను తొలగించడానికి నోటీసులు జారీ చేసిందని, వారిని విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు సుబ్బారావు, వై.రాజు, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సెవెన్ హిల్స్ కార్మికులు

క్లుప్తంగా

పారిపోయి వచ్చిన పిల్లలను చేరదీసిన పోలీసులు



ఇద్దరు పిల్లలతో ఏఎస్సై శ్రీనివాస రావు

బీచ్‌రోడ్డు: ఆర్కేబీచ్ బస్ స్టాప్ ఎదురుగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు ఇద్దరు బాలురను మూడో పట్టణ పోలీసులు చేరదీశారు. వివరాలు ఇలా.. గుంటూరు జిల్లా చెందిన ఇద్దరు విద్యార్థులు ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నారు. ఈ ఇద్దరు పిల్లలు ఇంట్లో చెప్పకుండా విశాఖ చేరుకున్నారు. బీచ్‌లో అనుమానాస్పదంగా తిరగడంతో ఏఎస్సై శ్రీనివాస రావు వారి వద్దకు వెళ్లి ఆరా తీశారు. వారు చెప్పిన వివరాలు ప్రకారం గుంటూరు పట్టాపురం పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. అనంతరం వారిని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

27న ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ప్రభుత్వ పాత పారిశ్రామిక శిక్షణ(ఐటీఐ) సంస్థలో ఈ నెల 27న చెన్నైకి చెందిన ఇన్‌ఫాక్ట్ ఇండియా ప్రై.లి. కంపెనీ ఉద్యోగాల భర్తీకి ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా అన్ని ట్రేడ్ల పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావొచ్చన్నారు. జీతం రూ.13,900లు, ఇతర అలవెన్స్‌లు ఉంటాయన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలతో బుధవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 94401 97068 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు



నెట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం పొందిన బాలికల జట్టు

విశాఖ విద్య: 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు సత్తా చాటుతున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం చిన్న తిప్ప సముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగిన నెట్‌బాల్ టోర్నమెంట్‌లో అండర్ -17 బాలికల విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అదే విధంగా నవంబర్ 10 నుంచి 12 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్-17 బాలుర విభాగంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా గాజువాకలో జరిగిన అండర్ -14 కేటగిరీ బాల బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ సంవత్సరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నెట్ బాల్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం జిల్లా అన్ని కేటగిరిలో ప్రథమ స్థానం నిలిచినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు తెలిపారు. విద్యార్థులను డీఈవో ప్రేమ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

- అర్జీల పరిష్కారం బాధ్యతగా తీసుకోవాలి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 325 వినతులు

మహారాణిపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చక్కని పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లాకు సంబంధించి వచ్చిన అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజలను 325 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు అర్జీదారునితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పూర్వాపరాలు తెలుసుకుని శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై పదే పదే అర్జీలు రాకూడదని స్పష్టం చేశారు. ఇంటింటి సర్వేను ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో వివిధ శాఖల లక్ష్య సాధనలో పురోగతిపై సమీక్షిస్తామన్నారు. కలెక్టర్‌తోపాటు జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ వినతులు స్వీకరించారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 110 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 వినతులు అందినట్టు మేయర్ హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని మేయర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జోన్-1కి 5, జోన్-2కు 17, జోన్- 3కి 13, జోన్-4కు 15, జోన్-5కు 13, జోన్-6కు 8, జోన్-7కు ఒకటి, జోన్-8కి 10 ఫిర్యాదులు అందాయన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 28 వినతులు అందాయని తెలిపారు. అనంతరం కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ అర్జీలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు, సీసీపీ ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీఆర్ ఎస్. శ్రీనివాస్, యూసీడీ పీడీ సత్యవేణి, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 100 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

అర్జీల పరిష్కారంలో జాప్యంపై కమిషనర్ ఆగ్రహం

ప్రజా సమస్యల పరిష్కారంలో వచ్చే ఫిర్యాదులు పరిష్కరించడంలో ఆలస్యంపై కమిషనర్ సంపత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌పై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని జోనల్ కమిషనర్లు, అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ముందు జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వస్తున్న ఫిర్యాదులే మళ్లీ నమోదవుతున్నాని, ఆయా సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు వివరణ ఇవ్వడంలో చాలా లోపాలు కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వెంటనే ఏర్పాటు చేయాలని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావును కమిషనర్ ఆదేశించారు. ఇకపై ప్రతిరోజూ ఆకస్మికంగా పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహిస్తానన్నారు.

టీడీఆర్‌లపై కమిషనర్ సమీక్ష



టీడీఆర్‌లపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: నగరంలో పలు అభివృద్ధి పనుల్లో వివిధ దశలో ఉన్న టీడీఆర్‌లపై పట్టణ ప్రణాళికా అధికారులతో కలిసి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అన్ని జోన్లలో విడుదల చేయాల్సిన టీడీఆర్‌లకు సంబంధించి పూర్తి వివరాలు జోన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. టీడీఆర్‌ల విడుదలపై సమాచారాన్ని సంక్షిప్తంగా నివేదిక రూపంలో అందించాలని, అందుకు సంబంధించి టార్గెట్లను నిర్దేశిస్తూ త్వరితగతిన టీడీఆర్‌ల విడుదలకు సంబంధించి చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో అనధికార, అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి జోన్‌కు వాహనాలతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వెంటనే ఏర్పాటు చేసి అనధికా, అక్రమ నిర్మాణాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావును ఆదేశించారు.

చండీగఢ్, పుదుచ్చేరి విజయం



విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎం) ట్రోఫీలో భాగంగా సోమవారం వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ల్లో చండీగఢ్, పుదుచ్చేరి జట్లు విజయం సాధించాయి. తొలుత చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన చండీగఢ్ తొమ్మిది వికెట్లకు 191 పరుగులు చేసింది. విదర్భ జట్టు తొమ్మిది వికెట్లకు 186 పరుగులు చేసి ఓటమి చెందింది. రెండు విజయాలతో 8 పాయింట్లతో చండీగఢ్ ఆధిక్యంలో దూసుకెళ్లింది. పుదుచ్చేరితో జరిగిన మరో మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ తొలుత బ్యాటింగ్ చేసి ఏడు వికెట్లకు 164 పరుగులు చేసింది. ప్రతిగా పుదుచ్చేరి మరో నాలుగు బంతులుండగానే నాలుగు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది.

డిజిటల్ పరివర్తనతో మెరుగైన పాలన



శిక్షణలో పాల్గొన్న వివిధ రంగాల భాగస్వామ్యులు

తగరపువలస: పరిపాలనను మెరుగు పరిచేందుకు, దేశ పౌరుల రోజువారీ జీవితాలను ప్రభావితం చేయడానికి డిజిటల్ పరివర్తన దోహదం చేస్తుందని నేషనల్ ఈ-గవర్నెన్స్ డివిజన్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ డిడెల్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సోమవారం ప్రారంభమైన 'మేనేజింగ్ లార్జ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ప్రాజెక్టు'పై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో దేశ వ్యాప్తంగా 31 మంది భాగస్వామ్యులు పాల్గొంటారన్నారు. వీరిలో టౌన్ మరియు కంట్రీ ప్లానింగ్, సామాజిక న్యాయం, సాధికారత, పౌర విమానయానం, బ్రాడ్ కాస్టింగ్ వంటి విభిన్న రంగాల నుంచి వచ్చిన వారు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం డిజిటల్ సాధికారిత కలిగిన భారతదేశాన్ని భాగస్వామ్య దృక్పథం, సహకారం, ఆవిష్కరణలు వైపు నడిపించే అవకాశం ఉందన్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా, పోలీస్ డిపార్ట్‌మెంట్ తదితర విభాగాలు ప్రోగ్రాం డిజిటల్ పరివర్తన, వినియోగం, డిజిటల్ ట్రస్ట్ నిర్మాణం, నిర్వహణ వ్యూహాలను అమలు చేయడంపై దృష్టి సారించాలన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ జోస్యుల శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున డిజిటల్ పరివర్తన ప్రాజెక్టులు నిర్వహించడానికి, ప్రభుత్వ సంస్థలకు అధికారం కల్పించడంలో చొరవ గురించి వివరించారు. ప్రోగ్రాం కో డైరెక్టర్ అభిషేక్ శ్రీవాస్తవ్ మాట్లాడుతూ ప్రోగ్రాంను సులభతరం చేయడంలో నేషనల్ ఈ-గవర్నెన్స్ డివిజన్ పాత్ర గురించి తెలిపారు. కార్యక్రమంలో ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు.

కలెక్టరేట్ చరిత్రపై ఫొటో ప్రదర్శన



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జిల్లా అధికారులు

మహారాణిపేట: హెరిటేజ్ వీక్ ఉత్సవాల్లో భాగంగా 111 ఏళ్ల చరిత్ర కలిగిన విశాఖ కలెక్టరేట్ విశిష్టతలను, విశేషాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. భారత అర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించిన ప్రకారం నవంబర్ 19 నుంచి నవంబర్ 25 వరకు 'వైవిధ్యాన్ని కనుగొనండి – అనుభవించండి' అనే థీమ్‌తో నిర్వహించిన సాంస్కృతిక వారసత్వ వారోత్సవాలను పురస్కరించుకొని ఈ విశేష కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని చారిత్రక ప్రదేశాలకు సంబంధించిన విశేషాలను తెలుపుతూ అతిపెద్ద గ్యాలరీ త్వరలోనే అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. హిస్టరీ ఆఫ్ హెరిటేజ్ బిల్డింగ్‌గా కలెక్టరేట్ గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. గ్యాలరీ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్, ఇంటాక్ ప్రతినిధులు అడ్వార్డ్ పాల్, డాక్టర్ రాజశేఖర్, టూరిజం అధికారి జ్ఞానవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

నృత్య వైభవం



కళాకారుల నృత్య ప్రదర్శన



గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శన

ఏయూక్యాంపస్: భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని విశాఖలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు సోమవారం కూడా కొనసాగాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా మైదానంలో జరిగిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నగరవాసులను అలరించాయి. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు వారి సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పాయి. ఎంతో ప్రాచుర్యం పొందిన థింసా నృత్యం, కొమ్ము నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వాయిద్యాలకు అనుగుణంగా ఆదివాసీ మహిళలు ఏకరూప దుస్తులు ధరించి చేసిన నృత్యాలు ఆదివాసీ జీవన వైవిధ్యతను తెలియజేశాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ ఉత్పత్తుల విక్రయాలకు మంచి ఆదరణ లభించింది.

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రణవ్ గోపాల్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా ఎం.వి.ప్రణవ్‌గోపాల్ సోమవారం సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, బండారు, గణబాబు, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, టీడీపీ నేతలు పాల్గొని ప్రణవ్‌గోపాల్‌కు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ఎస్ఐ పదోన్నతి అర్హత పరీక్ష



ఎస్ఐ అర్హత పరీక్ష రాస్తున్న హెచ్‌సీలు, ఏఎస్ఐలు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధి జిల్లాల్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు ఎస్ఐ పదోన్నతి అర్హత పరీక్షలు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. రెండు రోజులు పాటు జరగనున్న ఈ పరీక్షలలో మొదటి రోజు రాత పరీక్ష ప్రశాంతగా జరిగింది. విశాఖ రేంజ్ డీఐజీ, ఎగ్జామినేషన్ బోర్డు చైర్మన్ గోపీనాథ్ జెట్టీ, బోర్డు సభ్యులు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ రేంజ్‌లో 40 మంది ఎస్ఐ అర్హత పరీక్షలలో పాల్గొంటున్నారని తెలిపారు. మొదటి రోజు రాత పరీక్ష మూడు నూతన చట్టాలు, స్పెషల్ అండ్ లోకల్ చట్టాలు, పరిశోధనలో శాస్త్రీయ సాధనాలు, స్టేషన్ హౌస్ రొటీన్ తదితర అంశాలపై జరిగిందన్నారు. మంగళవారం అవుట్ డోర్, మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని వచ్చే నెల 2 నుంచి తిరుపతిలో ప్రారంభంకానున్న ఎస్ఐ శిక్షణకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

28న సింహగిరిపై వేదసభ

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 28న వేదసభ నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణమండపంలో ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రుగ్వేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదంపై పండితులతో ఈ సభ జరగనుందన్నారు.



దేదీప్యమానం..కార్తీక దీపోత్సవం

ఎంవీపీకాలనీ: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ దర్శన్ కార్యాలయం ఆవరణలో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నగర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పూజలకు అవసరమైన సామగ్రిని హిందూ ధర్మప్రచార పరిషత్ సమకూర్చింది. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ విశాఖ జిల్లా సూపరింటెండెంట్ కాంతికుమార్‌తో పాటు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లనివ్వరు... వ్యాపారం చెయ్యనివ్వరు

- ప్రత్యామ్నాయం చూపకపోతే చావే శరణ్యం
- దుకాణాల తొలగింపుతో మత్స్యకారుల ఆందోళన



రాత్రి సమయాల్లో తొలగిస్తున్న దుకాణాలు (ఫైల్)



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

కొమ్మాది: వేట విరామం నుంచి మత్స్యకారుల బతుకు ఒడ్డున పడ్డ చేపలా తయారైంది. వేట నిషేధ భృతి అందలేదు. వరుస తుపానలతో వేట సరిగా సాగని పరిస్థితి. దీనికి తోడు రింగు వలల సమస్య. ఎటు వైపు చూసినా ఇబ్బందులే. ఇలాంటి సమయంలో గంగమ్మను నమ్ముకుని నెట్టుకొస్తున్న మత్స్యకారులపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. భీమిలి బీచ్ రోడ్డు రామాద్రి తీరం వెంబడి వీరు ఏర్పాటు చేసుకున్న 45 దుకాణాలను పర్యాటక అభివృద్ధి పేరిట తొలగించేశారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే తమ జీవితాలతో ఆడుకుంటుంటే, అండగా నిలవాల్సిన నాయకులు ముఖం చాటేస్తుంటే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలంటూ సోమవారం వీరంతా ఆందోళనకు దిగారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించడం ఎంత వరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. తొలగించిన దుకాణాల ఏర్పాటుకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

అక్కడో రూలు.. ఇక్కడో రూలా?

ఈ ప్రాంతానికి సమీపంలో ఉన్న తిమ్మాపురంలో ఓ వ్యక్తి రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమించి, ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. కుటుంబ పోషణ కోసం రోడ్డు వెంబడి దుకాణాలు పెట్టుకున్న తమపై మాత్రం ప్రతాపం చూపించారంటూ బాధితులు ఆక్షేపిస్తున్నారు. తిమ్మాపురంలో ఒక రూల్, మంగమారిపేటకు మరో రూలా అంటూ అధికారులను నిలదీస్తున్నారు. వారం రోజుల్లో ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపకపోతే చావే శరణ్యమని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. మత్స్యకారుల కడుపు కొట్టి పర్యాటక ప్రాజెక్టు నిర్మిస్తే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. వీరి ఆందోళనకు స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు సంఘీభావం ప్రకటించారు.

ఎలా బతకాలి



సముద్రాన్ని నమ్ముకున్న బతుకులు మావి. తుఫాన్ సమయాల్లో వేట అంతంత మాత్రమే. ఆర్థిక భారం తగ్గించుకునేందుకు చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు అభివృద్ధి పేరుతో దుకాణాలు తొలగించేశారు. మేం ఎలా బ్రతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

– కుమారి, బాధితురాలు, మంగమారిపేట

దౌర్జన్యంగా తొలగించారు



ఇక్కడి దుకాణాలపై బతుకుతున్న మాకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా దౌర్జన్యంగా దుకాణాలు తొలగించడం సరికాదు. మత్స్యకారుల ఆకలి కేకలు ప్రభుత్వానికి తెలియదా. ఇప్పటికే వేట లేక అప్పుల్లో చిక్కుకున్నాము. ఇప్పుడు దుకాణాల తొలగింపు మరింత అప్పుల పాలవుతాం.

– కె.దుర్గాప్రసాద్, బాధితుడు, రామాద్రి

చావే తప్ప మరో దిక్కులేదు



వేటకు వెళ్లనివ్వరు.. వ్యాపారం చేసుకోనివ్వరు.. మరి మత్స్యకారులు ఎలా బతకాలి. కూటమి నాయకులను నమ్ముకుని మేం దారుణంగా మోసపోయాం. ఇప్పటి వరకు వేట నిషేధ భృతి ఇవ్వనేలేదు. ఇస్తారన్న నమ్మకమూ లేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే మా బతుకులకు చావే దిక్కు.

– ఎ.అమర్‌నాథ్, మంగమారిపేట